క్లుప్తంగా

ఉలిక్కిపడ్డ భూ ఆక్రమణదారులు

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: సాక్షి దిన పత్రికలో గత రెండు రోజులు ప్రచురితమైన కథనాలతో అధికార టీడీపీలో కలకలం రేగింది. ఆదివారం 'గల్లీ లీడర్ల పెత్తనం', సోమవారం 'రత్నాల చెరువు ఫర్ సేల్' కథనాలతో ఆ పార్టీ లీడర్లు, ఆక్రమణదారులు ఉలిక్కిపడ్డారు. దీంతో వారికి వివిధ పనులపై డబ్బులిచ్చిన కొందరు తిరిగివ్వాలంటూ పట్టుబడుతున్నారు. ఇక బదిలీల కోసం తీసుకున్న డబ్బులు కూడా ఇచ్చేయాలని అడుగుతుండటంతో ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతానికి తేలుకుట్టిన దొంగల్లా మిన్నకుండిపోయారు. రత్నాల చెరువులో స్థలాలు కొనుగోలు చేసిన వారు కూడా.. తమకు స్థలాలు విక్రయించిన అక్రమణదారులని నిలదీస్తున్నారు. స్థలాలు వద్దని, తిరిగి డబ్బులు ఇచ్చేయండి అంటూ అడుగుతున్నారు. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మరో వైపు అధికారులు విచారణ జరుపుతుండడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

తుళ్లూరు డీఎస్పీగా టి.మురళీకృష్ణ బాధ్యతలు



తాడికొండ: తుళ్లూరు డీఎస్పీగా టి.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మందడంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో పలువురు సీఐలు, ఎస్ఐలు సిబ్బంది డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి డెకాథ్లాన్‌లో సత్తా చాటిన మునీర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా డెకాథ్లాన్ ఈవెంట్‌లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి షేక్ మునీర్ తృతీయస్థానంలో నిలిచినట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. సోమవారం అమరావతిరోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఈనెల 4,5,6వ తేదీల్లో జరిగిన 37వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్-20 బాలుర విభాగంలో తమ విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. విద్యార్థి మునీర్‌కు భవిష్యత్తులో క్రీడల్లో ముందుకెళ్లేందుకు అవసరమైన సదుపాయాలను కలిపిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరి రవి పాల్గొన్నారు.

ఉత్తమ బాల నటుడి అవార్డు స్వీకారం



తాడేపల్లిరూరల్: కొలనుకొండకు చెందిన బళ్ల మోక్షిత్ సాయి ఉత్తమ బాల నటుడు అవార్డును అందుకున్నాడు. సోమవారం అతని తండ్రి అశోక్ మాట్లాడుతూ విజయవాడలో జరిగిన తెలుగు షార్ట్ ఫిలిమ్స్ కాంపిటీషన్‌లో 15 లఘు చిత్రాలు ప్రదర్శించగా వినదగునెవ్వరు చెప్పిన అనే షార్ట్ ఫిలింలో నటించినందుకు తన కుమారుడు మోక్షిత్ సాయి ఆదివారం ఉత్తమ బాల నటుడు అవార్డును సినీ నటుడు అజయ్ ఘోష్ చేతుల మీదుగా అందుకున్నాడని తెలిపారు.

పెళ్లి చేసుకుంటానంటూ మోసం చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఒకే ప్రాంతంలో ఉంటూ ప్రేమించి చివరకు వివాహం చేసుకోకుండా బెదిరింపులకు దిగుతూ దుర్భాషలాడిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావుపేట 2వ లైన్ ప్రాంతానికి చెందిన అమరబోయిన పూర్ణ అనే యువతి, అదే ప్రాంతానికి చెందిన తన్నీరు గౌతమ్‌లు ప్రేమించుకున్నారు. చాలా కాలంగా ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. అయితే వివాహం చేసుకోమని అడిగినందుకు గౌతమ్ పూర్ణను వేధింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తన్నీరు గౌతమ్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కుటుంబ ఖర్చుల కోసం అప్పు తీసుకుని నాలుగు సంవత్సరాలైనా చెల్లించక పోగా బెదిరింపులకు దిగిన వ్యక్తిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 10వ లైన్ ప్రాంతానికి చెందిన కొత్త అనంతరామిరెడ్డి అనే వ్యక్తి వద్ద లింగాయపాలెం ప్లాట్‌లలో నివాసం ఉండే నారాయణరావు అనే వ్యక్తి రూ.లక్ష నగదు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీసుకుని నాలుగు సంవత్సరాలు అవుతున్న చెల్లించక పోగా అడిగేందుకు వెళ్లిన అనంత రామిరెడ్డిపై దురుసుగా వ్యవహరించడం, బెదిరింపులకు దిగడం చేస్తున్నాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నారాయణరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంగళగిరి: మహా చండీదేవిగా అమ్మవారు



మంగళగిరి: కాశీ అన్నపూర్ణా దేవీగా..



ఫిరంగిపురం: విశేష అలంకరణలో విజయదుర్గా మాత



తాడేపల్లిరూరల్: మహా చండీగా అమ్మవారు



ఆదిలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మీదేవి

మహా చండీ నమోస్తుతే..

తాడేపల్లిరూరల్/మంగళగిరి: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం పలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మహాచండీ, జయలక్ష్మి, గౌరీదేవి అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.



మంగళగిరి: కాళీ మాత ఆలయంలో భక్తుల పూజలు



విజయకీలాద్రిపై జయలక్ష్మీ అమ్మవారి దర్శనం



తాడేపల్లి రూరల్: రామమందిరంలో ప్రత్యేక పూజలు

మన మంగళగిరి.. మన సిండి'కేట్'లు

- నూతన మద్యం పాలసీలో 19 దుకాణాలకు అనుమతి
- తన పాలసీనే పాటించాలని ప్రజాప్రతినిధి హుకుం
- సిండికేట్‌లో భాగమవ్వాలని ఒత్తిడి
- నాన్ రీఫండ్ మిగుల్చుకునేందుకు ఎత్తుగడ
- దుకాణం దక్కినా.. సిండికేట్‌కు సమర్పణ తప్పనిసరి
- ఆదిలోనే అమంగళంతో వ్యాపారులు దరఖాస్తుకు దూరం
- 'మనోళ్ల' మనుగడకు.. ప్రభుత్వ ఆదాయానికి గండి



పట్టణంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయం

మంగళగిరి: నూతన మద్యం పాలసీలో భాగంగా మంగళగిరి పట్టణంలో మొత్తం 19 మద్యం దుకాణాలకు అధికారులు టెండర్లు పిలిచారు. ఈ నెల 9వ తేదీతో టెండర్ల గడువు ముగుస్తుంది. ప్రైమ్ ఏరియా కావడంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు భావించారు. టెండర్లు వేయడానికి వ్యాపారులు బారులు తీరుతారని ఆశించారు. కానీ, ఇప్పటి వరకు వచ్చిన టెండర్లు చూసి కంగుతింటున్నారు. కప్పం కట్టండి.. దరఖాస్తు చేసుకోండి అంటూ ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి హుకుం జారీ కావడంతో పాటు దరఖాస్తుదారులు సిండికేట్‌లో కలవాలనే ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో టెండరు వేయడానికి వ్యాపారులు కలవర పడుతున్నారు. ఇంత ఒత్తిడి మధ్య వ్యాపారం అవసరమా అని దరఖాస్తుకు దూరంగా ఉండిపోతున్నారు. టెండర్లు వేసేవారందరిని సిండికేట్ చేసి, చివర్లో మద్యం దుకాణాలకు తక్కువ టెండర్లు వేయడం ద్వారా నాన్ రిఫండ్‌బుల్ రూ.2 లక్షలు ఖర్చు తగ్గించుకోవచ్చని వారి ప్లాన్. సిండి'కేట్'లు ఒక దుకాణానికి తన అనునాయుల పేర్లతోనే తక్కువ దరఖాస్తులు వేస్తే.. వాటిలో ఎవరికి లాటరీ తగిలినా దుకాణం తమకే వస్తుందని ఆశిస్తున్నారు. నూతన మద్యం పాలసీ వస్తుందని తెలిసిన నాటి నుంచే సిండికేట్‌లు తమ పనివాళ్లు, అనునాయులు, కల్లుగీత కార్మికుల ఆధార్ కార్డులను సేకరించి, సిద్ధంగా పెట్టుకున్నారు. దరఖాస్తులు చేసేందుకు పెద్ద మొత్తంలో నగదు సమకూర్చుకుని రంగంలోకి దిగారు. సిండికేట్‌దారులు ప్రయత్నాలు సఫలమైతే ప్రభుత్వ ఆదాయానికి గండి తప్పదు. మద్యం వ్యాపారంలోకి అడుగు పెట్టేవారు సొంతంగా దరఖాస్తులు చేసి, లాటరీలో దుకాణం దక్కించుకున్నా.. చివరకు దానిని సిండికేట్‌కు అప్పగించక తప్పదు. ఎన్నో సంవత్సరాలుగా మద్యం వ్యాపారంలో పాతుకుపోయిన సిండికేట్ నిర్వాహకులే 19 దుకాణాలను దక్కించుకోవడం ఖాయం కావడంతో, కొత్త వారు దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడం లేదని అధికారులే చెబుతుండడం విశేషం.

ఎట్టకేలకు తొలగిన చెత్త

సాక్షి ఎఫెక్ట్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సమతా వాణి, ఈవోపీఆర్డీ

తాడికొండ: 'పారిశుద్ధ్యం అధ్వాన్నం' పేరుతో మండల కేంద్రమైన తాడికొండలో పేరుకుపోయిన చెత్తను సాక్షిలో ప్రచురించడంతో ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. సోమవారం గ్రామంలో చెత్త నిల్వలను ఎంపీడీవో సమతావాణి, ఈవోపీఆర్డీ శివలీలలు స్వయంగా వెళ్లి పరిశీలించారు. నెలల తరబడిగా పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నించారు. వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవడంతో దాదాపు 6 ట్రాక్టర్లకు పైగా చెత్తను కార్మికులు తొలగించి, డంపింగ్ యార్డుకు తరలించారు. ఇకపై ఇలాంటివి జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి, సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి హరిబాబు తెలిపారు.

ఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించాలి



నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

తాడికొండ: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణను నిలిపివేసి, ఆక్రమిత ప్రాంతాల నుంచి తన సైన్యం వైదొలగాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం తుళ్లూరు లైబ్రరీ కూడలిలో నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇజ్రాయెల్ పాలస్తీనాపై యుద్ధం ప్రారంభించి నేటికి సంవత్సరం పూర్తి కావస్తోందన్నారు. అమెరికా, బ్రిటన్ వత్తాసుతో ఇప్పటికే 85 వేల మందిని ఇజ్రాయెల్ సైన్యం చంపేసిందని పేర్కొన్నారు. బాంబులతో మారణ హోమం సృష్టిస్తున్న ఇజ్రాయెల్ సైన్యం యుద్ధం నిలిపివేసే విధంగా ఐక్యరాజ్య సమితి తీర్మానానికి కట్టుబడాలన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు పేరం బాబురావు, షేక్ జానీ, చింతల భాస్కరరావు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ప్రగతి పథం



మాట్లాడుతున్న ఎంపీడీవో సమతా వాణి

తాడికొండ: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఎంపీడీవో సమతావాణి సూచించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలందించడంలో సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. జిల్లాలోనే ముందంజలో తాడికొండ ప్రగతి పథంలో నడిపేందుకు అన్ని శాఖల మధ్య సహకారంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొచ్చి, నేరుగా పరిష్కరించుకోవాలి కానీ, పెండింగ్ పెట్టి పెంచుకోవద్దని సూచించారు. ఈ నెల 9,10 తేదీల్లో ఉప సర్పంచ్‌లు, ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలుంటాయని చెప్పారు. అందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివలీల తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన మినీ లారీ

- ఇద్దరికి తీవ్రగాయాలు
- చికిత్సకోసం తరలింపు



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు మినీ లారీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని రేపూడి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుంటూరుకు చెందిన మినీ లారీ పల్నాడు జిల్లా నకరికల్లు వెళ్లి తిరిగొస్తోంది. రేపూడి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కగా నున్న పంట కాల్వలోకి దూసుకెళ్లి తిరగబడింది. డ్రైవర్ బుడే, మరో ప్రయాణికుడికి తీవ్రంగా గాయాలయ్యాయి, ఇది గమనించిన స్థానికులు లారీలో ఇరుక్కున్న వారిని బయటకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న సీఐ రవీంద్ర బాబు ఘటనా స్థలానికి సిబ్బందిని పంపి, వారిని 108లో చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రతి రైతుకు వరద పరిహారం అందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందించి సమస్యలు వివరిస్తున్న సాంబిరెడ్డి

తెనాలిరూరల్: పంటనష్టం నమోదు కాని నేల పాడు తదితర రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి నాయకత్వంలో కౌలు రైతులు, రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా పాడి రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, అన్నవరపు లంకకు చెందిన రైతు, కౌలు రైతులు, డ్వాక్రా రుణాలు రద్దు చేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని, వరదకు పాడైపోయిన మోటార్లు మరమత్తులు చేయించాలని, పథకంసకు రూ.3కోట్లు నిధులు మంజూరు చేయాలని, కోల్డ్ స్టోరేజ్‌లో దగ్ధమైన పసుపు పరిహారం వెంటనే ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. రుణాలు రీ షెడ్యూలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, మోటారు రీపేర్లకు ఆదేశాలు ఇస్తాంఅని చెప్పారు. మెప్మా ద్వారా బ్యాంకు రుణాలు ఇప్పించాలని ఎంపీడీవో తెలిపారు. హైలెవల్ ఛానల్, పసుపు రైతుల సమస్యలపరిశీలనలో ఉందని చెప్పారు. పిరాటి అప్పారావు, తోట శ్రీధర్, తెనాలి ఏసుమణి, కమలమ్మ, టి.ఏడుకొండలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మంచినీటి దోపిడీ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి దందాకు ఇంజినీరింగ్ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఒక పక్క నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వాటర్ ట్యాంకులను భవన నిర్మాణాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. రోజుకు లక్షలాది లీటర్ల మంచినీరు అక్రమంగా ట్యాంకుల ద్వారా తరలించి భవన నిర్మాణాలకు, కమర్షియల్ పనులకు వినియోగించుకుంటూ వేల రూపాయలను తమ జేబుల్లో వేసుకుంటున్నారు.

జీజీహెచ్ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత



పరిసరాలు శుభ్రం చేస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద సుందరీకరణ కోసం ప్రత్యేక పూజలతో శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆస్పత్రి లోపల గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండటం వలన వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇటీవల వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆసుపత్రిలోనికి కేవలం రోగులు, వారి సహాయకులను మాత్రమే అనుమతించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేసేందుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి గోడలను నీళ్లతో కడిగి పరిశుభ్రం చేశారు. ఎలాంటి దుర్గంధపూరితమైన వాతవరణం లేకుండా సుందరీకరణ చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పారిశుద్ధ్య నిర్వహణ, సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఆస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఏఎస్ఐ సాంబవశివరావు, ఎస్‌బీ సిబ్బంది

లక్ష్మీపురం: నైట్ బీట్ విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ సాంబశివరావు పలకలూరు రోడ్డు కరెంట్ ఆఫీస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్ వాహనాన్ని అడ్డుకోని స్టేషన్‌కు తరలించిన ఘటన సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుజ్జనగుండ్ల, పలకలూరు రోడ్డు కరెంట్ ఆఫీస్ దగ్గరలో మెయిన్ రోడ్డుపై పెదపలకలూరు వైపున పీడీఎస్ బియ్యంను బొలెరో వాహనంలో అక్రమ రవాణా చేస్తున్నారు. అదే సమయంలో నైట్ బీట్ విధులు నిర్వహిస్తున్న స్టేషన్ ఏఎస్ఐ సాంబశివరావు అనుమానంతో వాహనం నిలిపి స్టేషన్‌కు సమాచారం తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జడా నాగేశ్వరరావు, ఫణి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనంలో తనిఖీలు చేయగా 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించింది. వాహనంలోని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి సెల్ ఫోన్‌లు, రూ.6వేల నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు

- అలా లేకుంటే ఓసీ జారీచేయబోం
- నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రైనేజీ లైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కోదండరామయ్య నగర్, గోరంట్ల, పెద్ద పలకలూరు రోడ్, కాకాని రోడ్, ఆర్టీసీ కాలని తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లు, డ్రైన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవనాలు నిర్మాణ దశలో వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆర్టీసి కాలనిలో డ్రైన్‌ని ఆక్రమించి ర్యాంప్‌లు చేసిన నిర్మాణం గమనించి సంబంధిత ప్లానింగ్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీదవరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలన్నారు. వాచ్‌మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్టుమెంట్ నిర్వాహకులే డ్రైనేజీ లైన్‌ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ డి.రాంబాబు, టీపీఎస్‌లు లక్ష్మణస్వామి, సువర్ణ కుమార్, రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నారు.

ఇజ్రాయెల్ దాడులను వెంటనే ఆపాలి



మంగళగిరి: పాలస్తీనాపై జరుగుతున్న ఇజ్రాయెల్ దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇరు పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యుద్ధంలో సామాన్యులు, పిల్లలు, మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనాపై దాడులను వెంటనే నిలిపి సామాన్యుల ప్రజల కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్ , చెంగయ్య,జేవి రాఘవులు, జువ్వాది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.